


# పరదేశీ కథలు

– చిట్టే సిద్ధ లలిత



-85-

## ఎడారి బంధం

ఎడారి చలి వణికిస్తోంది. కువైట్ దేశంలోని సబ హాస్పిటల్.. గాయాలను, బాధలను మోస్తూ నిలబడి వుంది. వార్డుల్లోని రోగులందరూ బ్లాంకెట్ ను నిండా కప్పుకుని ముణగదీసుకుని పడుకున్నారు. అక్కడక్కడా బాధను భరించలేని కొందరి రోగుల మూలుగులు అణచిపెట్టుకున్న వేదనను కెలుకుతూ కర్ణకఠోరంగా వినబడుతున్నాయి. అర్థంలేని ఆలోచనలతో రాత్రి వ్యర్థంగా
గడిచిపోయింది. హాస్పిటల్లోని బెడ్ పైన అసహాయంగా పడి వుంది మంగ. దిగులును దుప్పటిలా కప్పుకోవడంతో కంటికి నిద్ర రావడం లేదు.

ఇంకాసేపటిలో తెల్లవారబోతోందనుటకు సూచనగా మసీదులోనుండి అల్లా హు అక్బర్ అంటూ ప్రార్థనకు పిలుపు వినబడుతోంది. రోగులు కొందరు బెడ్ పైనే లేచి కూర్చుని నమాజ్ చేసుకుంటున్నారు. ప్రార్థనలు బాధలను, కష్టాలను, కన్నీళ్ళను దూరం చేస్తాయా. దేవుడనే వాడున్నాడా.. వుంటే మనుషులకు ఈ బాధలెందుకు? గాయం సలుపుతోంది. నొప్పి వేధిస్తోంది. భరించలేని బాధతో కంటిమీదకి కునుకు రావడం లేదు. అంతా కలలాగా జరిగిపోయింది.

ఎడారి జీవితం మానని గాయాన్ని మిగిల్చింది. దీనిని ఎలా భరించడం. కత్తి మీద నిలబడి సాము చేస్తున్నట్లుంది పాడు జీవితం. ఎన్ని రోజులు ఇలా ఈ ప్రాణాన్ని గట్టిగా పట్టి నిలపడం. ఇప్పటికే ఈ హాస్పిటల్ లోకి వచ్చి నెలరోజులు గడిచిపోయాయి. కువైట్ డాక్టర్లు ఇక్కడ ఏమీ చేయలేం ఇండియాకు వెళ్ళి చూపించుకో అంటున్నారు. ఇప్పుడేమి చేయడం. విమానమెక్కి ప్రయాణించి ఇల్లు చేరే శక్తి తనకుందా? మధ్యలోనే ఆకాశంలో ప్రాణం పోదు కదా.

వద్దన్నా ఆరోజు.. నెలక్రితం జరిగిన సంఘటన పీడకలగా వచ్చి మదిని చుట్టుముడుతోంది. నిద్రపోతే కలల్లోకి

కూడా అదే వచ్చి కలవరపెడుతోంది. తిరిగి తను మామూలు మనిషి కాగలదా. కన్నీళ్ళు పొంగుకొస్తుంటే తలకు చుట్టిన కట్టును చేత్తో తడుముకుంది మంగ.

"మంగా.. ఐ లవ్ యూ. నన్ను పెళ్ళి చేసుకోవా ప్లీజ్. నీకు పేద్ద కారు కొనిస్తాను. మనమిద్దరం కువైట్ అంతా తిరుగుదాం. రాత్రయితే ఎంచక్కా బెడ్ పైన పడుకుని అమ్మానాన్న ఆట ఆడుకుందాం. నిన్ను వదిలి వుండలేను. ప్లీజ్. నన్ను చేసుకో".. గడ్డం పట్టుకుని బ్రతిమలాడుతున్నాడు అహ్మద్. వాడి కళ్ళలో మంగ పట్ల అంతులేని ప్రేమ కనబడుతోంది.

"అలాగే అహ్మద్ ముందు నువ్వు ఈ అన్నం తిను" అంటూ నచ్చచెప్పి ఆప్యాయంగా ఒక్కో ముద్దా నోట్లో పెడుతూ వాడికి అన్నం తినిపిస్తోంది మంగ.

వాడి పిచ్చి మాటలకు, చేష్టలకు అక్కడ వున్న కద్దామాలు (పని మనుషులు) అందరూ పగలబడి నవ్వుతున్నారు.

"ఏయ్ నవ్వకండి. నిజంగానే నేను మంగని పెళ్ళి చేసుకుంటాను. మేము కార్లో ఊరంతా తిరుగుతాం. విమానమెక్కి లండన్, ప్యారిస్ హనీమూన్ వెళతాం.

పాపం మంగ, వాళ్ళ అమ్మానాన్నలను ఇండియాలో వదిలేసి నా కోసం కువైట్ కి వచ్చేసింది. పదేళ్ళుగా నాతోపాటు, ఇక్కడే వుంది. అందుకే మంగను నేను ప్రేమిస్తున్నాను. పెళ్ళి చేసుకుని నా దగ్గరే వుంచుకుంటాను" అంటూ గంతులు వేసాడు అహ్మద్.

అందరూ వాడి పిచ్చి చేష్టలకు మరలా గలగలా నవ్వేసారు. ఒక పిలిప్పినో కద్దామా వచ్చి అహ్మద్ బుగ్గ మీద గిల్లి "అహ్మదో నన్ను కూడా పెళ్ళి చేసుకోవా. నేను కూడా నీతో అమ్మానాన్నా ఆట ఆడతాను ప్లీజ్" అంది వేళాకోళంగా.

"నో.. నిన్ను చేసుకోను. మంగనే చేసుకుంటాను. నువ్వు దూరంగా పో" అని దురుసుగా దాన్ని పక్కకు తోసేసాడు అహ్మద్.

"ఈ పిచ్చోడిని మంగ కాబట్టి ఓపికగా భరిస్తోంది. మనమయితే ఒక్కరోజు కూడా వీడికి సేవలు చెయ్యలేం. పిచ్చి లేసినప్పుడు వీడు కొట్టే దెబ్బలు భరించలేక పారిపోతాం" చెప్పింది శ్రీలంక కద్దామా.

ఆమె మాటలు అర్థమయినట్లు కోపంగా చూసాడు అహ్మద్.

దగ్గరుంటే మీదపడి కొడతాడు కూడా. అహ్మద్ చూపులకు భయపడి ఒకడుగు వెనక్కి వేసింది శ్రీలంక పనిమనిషి.

అహ్మద్ పుట్టుకతోనే మతి స్థిమితం లేని వాడు. ఒక మానసిక రోగి. వయసు ఇరవై యేళ్ళయినా స్వభావం ఐదేండ్ల పిల్లవాడిలా వుంటుంది.

ఎప్పుడేం చేస్తాడో, ఎప్పుడేం మాట్లాడుతాడో అతడికి తెలీదు. అహ్మద్ ను చూసుకోవడానికే మంగను పనిలో పెట్టుకున్నారు ఆ కువైటీ వాళ్ళు.

ఒక్కోసారి వాడి చేష్టలను భరించడం, వాడు చేసే అర్థం లేని పనులను సరి చేయడం తలకు మించిన భారమైనా పనిమనిషికి తప్పదు మరి. మంగ సహనానికి పరీక్ష పెడుతుంటాడు అహ్మద్.

కువైట్ అరబ్ షేకుల ఇంట్లో పని అలాగే వుంటుంది. కువైట్ దేశంలో మతి స్థిమితం లేనివాళ్ళు, రోగులు, మంచానపడిన ముసలివాళ్ళు ఎక్కువగా వుంటారు. వాళ్ళను చూసుకోవడానికి కద్దామాలు విరివిగా అవసరం. డబ్బున్న దేశం కాబట్టి విలాసంగా జీవితాన్ని గడపడానికి అలవాటు పడ్డారు వాళ్ళు.

కోరినట్లుగా ఇళ్ళు, కార్లు, బట్టలు, నగలు, వస్తువులు వుండటంతో మనలాగా వాళ్ళకి బ్రతుకు పోరాటాలుండవు.

ఇంతలో అహ్మద్ వాళ్ళమ్మ మామా ఆయేషా అక్కడికి రావడంతో అందరూ భయపడి నవ్వులు ఆపి "సలామా లేకుం మామా" అంటూ లేచి నిలబడ్డారు.

"ఏం జరుగుతోందిక్కడ? ఆ నవ్వులేమిటి. మాటలేమిటి. పని ఏమీ లేదా. అందరూ ఒకచోట చేరి కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటున్నారా" గద్దించింది మామా ఆయేషా.

అందరూ మామాకు భయపడి నోరు మూసుకుని కళ్ళప్పగించి చూస్తున్నారు.

అహ్మద్ మాత్రం "అమ్మా.. అమ్మా నేను మంగను పెళ్ళి చేసుకుంటానే. మంగను ఇండియాకు పోనీకుండా నా దగ్గరే వుంచుకుంటానే, నువ్వు మాకు తొందరగా పెళ్ళి చెయ్యవే" అన్నాడు వాళ్ళమ్మ చెయ్యి పట్టుకుని ఊపుతూ.

"అలాగే నాన్నా. నువ్వు ముందు  అన్నం తిను" అంటూ కొడుకు వైపు ప్రేమగా చూసింది మామా.

"మా అమ్మ మంచిది. నాకు మంగకు పెళ్ళి చేస్తుంది" అంటూ పకపకా నవ్వాడు అహ్మద్.

ఇటు మంగవైపు తిరిగి అహ్మద్ వినకుండా "ఇలాంటి మాటలు అహ్మద్ కు ఎవరు నేర్పిస్తున్నారు" కోపంగా ప్రశ్నించింది మామా.

భయపడింది మంగ. నోట్లోంచి మాట రాలేదు. తప్పుచేసిన దానిలా తలవంచుకుంది.

"జాగ్రత్త. మంచి మాటలు నేర్పించి బాగా చూసుకో" చెప్పి బయటికి వెళ్ళిపోయింది మామా. హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నారు అందరూ.

మామా షేకుల కుటుంబానికి (రాజవంశం) చెందినది. ఆమెకు అహ్మద్ ఒక్కడే కొడుకు. ఆ ఒక్క పిల్లాడు కూడా శారీరక, మానసిక లోపాలతో పుట్టాడు. బాబా పెద్ద పోలీసు అధికారి. ఆయనకు ఇంకా పిల్లలు కావాలనే ఆశ వున్నా, మామా రాజవంశానికి చెందినది కావడంతో బాబా మరో పెళ్ళి చేసుకోవడమనే సాహసాన్ని చెయ్యలేదు.

కానీ చాటుగా ఇంకో ఫామిలీని నడిపిస్తున్నాడనే పుకారు వుంది. అందుకే మామా అనుమానంతో అప్పుడప్పుడూ బాబాతో గొడవ పడుతూ వుంటుంది. పదేళ్ళ క్రితం అహ్మద్ ను చూసుకోవడానికి మంగను పనిలోకి తీసుకున్నారు. అప్పటినుండీ ఎంతో ఓపికగా పని చేస్తోంది మంగ.

అపుడప్పుడూ కోపమొచ్చినప్పుడు చేతికందిన వస్తువులను మీదకి విసిరేయడం అహ్మద్ కు అలవాటే.

అలా చాలాసార్లు దెబ్బలు తగిలినా పిచ్చివాడనే జాలితో మంగ ఓర్చుకునేది. తగిలిన దెబ్బలకు ఆయింట్ మెంట్ రాసుకునేది.

కొట్టిన కొద్దిసేపటికే అహ్మద్ కోపం తగ్గిపోయేది. వెంటనే మంగను కౌగిలించుకుని, "సారీ మంగా.. నువ్వంటే నాకు చాలా ఇష్టం. నువ్వు లేకపోతే నేను వుండలేను. మా అమ్మకు చెప్పి నిన్ను పెళ్ళి చేసుకుంటాను అనేవాడు.

ఇదంతా అలవాటయిపోయింది మంగకు. మంగ కూడా అహ్మద్ ను విడిచి కాసేపైనా వుండలేకపోయేది. రోజంతా ఇద్దరే కలిసి గడపడంతో ఒకరికొకరు అలవాటయిపోయారు.

ఏదైనా అలవాటైతే అంతేనేమో? అది విడవలేని అనుబంధమవుతుందేమో.

ఆ రోజు శుక్రవారం. కువైట్ లో సెలవు దినం. ముస్లిములకు పవిత్రమైనది. ఎంతో ప్రత్యేకమైనది. బాబా ఉదయాన్నే లేచి స్నానం చేసి జుమ్మా ప్రార్ధనకు మసీదుకు వెళ్ళిపోయాడు.

ఆరోజు ఇల్లు శుభ్రం చేసే పని మనిషి రీటా జ్వరంతో పడుకుంది. మామా మంగను పిలిచి బాబా రూమును సర్ది పెట్టమంది.

"అలాగే మామా" అని చెప్పి మంగ బాబా గదిలోకి వెళ్ళింది.

అహ్మద్ మంగను విడిచి ఒక్క క్షణం కూడా వుండడు. వెనుకనే మంగతో పాటూ బాబా రూములోకి వెళ్ళాడు.

పడకలన్నీ మడిచి దుప్పట్లను సర్ది మాసిన బట్టలన్నీ ఒక బుట్టలో వేసింది.బాబా ఎక్కడివక్కడ పడేసి రూమును గందరగోళం చేస్తాడు. సర్దడం కష్టమే అయినా శ్రద్ధగా అన్నిటినీ పొందికగా సర్ది పెట్టింది. ఇక బాత్ రూం కడిగితే పని అయినట్లే అనుకుంది మంగ.

అహ్మద్ బాబా టేబుల్ ముందు కుర్చీలో కూర్చుని ఆటబొమ్మలతో ఆడుకుంటున్నాడు.ఒకవైపు పని చేస్తున్నా మరోవైపు వాడిపై ఒక కన్ను వేసి వుంచడం మంగకు అలవాటై పోయింది. ఇన్నేళ్ళయినా అతను ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తాడో ఆమెకే తెలియదు. వాడికీ తెలియదు. బాత్ రూములో వాష్ బేసిన్ కడిగి షవర్ రూం శుభ్రం చేద్దామని నీళ్ళను తిప్పింది. నీళ్ళ శబ్దంతో పనిలోపడి కాసేపు అహ్మద్ పైనుండి ఆమె దృష్టి మరలింది.

అంతే. ఇంతలో గుండె గుభిల్లు మనేలా ఢామ్మని శబ్దం వినిపించింది.

పరిగెత్తుకుంటూ రూములోకి వెళ్ళింది మంగ. ఏముంది..

అక్కడ బాబా టేబుల్ సొరుగులో వున్న పోలీస్ గన్ చేతిలో పట్టుకుని ఇష్టమొచ్చినట్లు గోడను కాల్చుతున్నాడు అహ్మద్.

భయపడిపోయింది మంగ."అహ్మద్ ఆపు.. కాల్చకు" అని అరిచింది మంగ.

వెంటనే ఇటు మంగ వైపు తిరిగాడు అహ్మద్. తరువాత ఏమయిందో మంగకు తెలియదు. కళ్ళు తెరిచేటప్పటికి ఆమె ఆసుపత్రిలో వుంది.

ఒక బుల్లెట్ చేతిలోకి, మరొకటి తలలోకి దూసుకుపోయాయి మంగకు. తలలోకి వెళ్ళిన బుల్లెట్ ను తీయడం కష్టమైపోతోంది డాక్టర్లకు. అది తీస్తే మంగ ప్రాణానికి ప్రమాదం. అందుకు మంచి అనుభవం గల సర్జన్స్ కావాలి.

కువైట్ కంటే ఇండియాలోనే మెరుగైన వైద్యం అందుతుంది. అక్కడి డాక్టర్లు అనుభవజ్ఞులు కాబట్టి ఆపరేషన్ చెయ్యగలరు అని తేల్చి చెప్పేసారు.

బాబా మామా కంగారు పడిపోయారు. ఎంత డబ్బు ఖర్చు అయినా సరే పెడతాం. మంగ గాయాన్ని మానిపి ఆరోగ్యాన్ని కుదుట పరచమని డాక్టర్లకు చెప్పారు.

అహ్మద్ సంగతి చెప్పనవసరం లేదు. మంగ కావాలని గొడవ చేస్తున్నాడు. అన్నం తినడం లేదు.. నిద్రపోవడం లేదట.

“నాకు మంగ కావాలి ఆసుపత్రికి పోదాం” అంటూ పిచ్చిగా బయటికి పరిగెడుతున్నాడట. సరేనని ఆసుపత్రికి తీసుకుని వస్తే మంగను వదిలి తిరిగి ఇంటికి పోనని మొండికేస్తున్నాడు.

అహ్మద్ ను పట్టుకుని సముదాయించడం చాలా కష్టమై పోతోందని మామా వాపోయింది.

మంగ పరిస్థితి రోజు రోజుకూ దిగజారుతోంది. మంగ తలకు గుండు చేయించి రోజూ తలకు, చేతికి కట్లు కడుతున్నారు డాక్టర్లు. అంతే కానీ తలలో కీలకమైన ప్రదేశంలో చిక్కుకుపోయిన బుల్లెట్ ను బయటికి తీయడమెలాగో వారికి అర్థం కావడం లేదు.

ఇక మంగను మెరుగైన ట్రీట్మెంట్ కోసం ఇండియాకు తిరిగి పంపించాలని వారు నిర్ణయించుకున్నారు. మంగ లేకుండా ఆమెను చూడకుండా అహ్మద్ వుండగలడా. వాడిని పట్టి ఆపగలమా? మామా బాబా కలవరపడిపోయారు. ఏం చెయ్యాలో తోచలేదు వారికి. అహ్మద్ ను కంట్రోల్ చెయ్యడం వారికి కూడా సాధ్యం కాదు. ఆ సంగతి వారికి బాగా తెలుసు.

కానీ మంగను ఇండియాకు పంపించక తప్పదు. టికెట్ బుక్ చేసారు. మంగ ప్రయాణానికి సిద్ధపడింది. మంగ చెల్లెలు హైదరాబాద్ లో వుండటంతో డైరెక్ట్ గా అక్కడ దిగి అక్కడి హాస్పిటల్ లో ట్రీట్మెంట్ తీసుకునే విధంగా నిర్ణయించారు.

విమానమెక్కుతుంటే మంగకు కూడా ఏడుపొచ్చింది. అహ్మద్ ను విడిచి వెళ్ళడం అసంభవం అనిపిస్తోంది. తను లేకుండా అహ్మద్ వుండలేడని తెలుసు. ఈ అనుబంధం ఇంతటితో ముగిసిపోయిందా. మరోసారి అహ్మద్ ను తిరిగి చూడగలదా. గుండె తొణికిసలాడింది మంగకు. ఆరోగ్యం ఏమయినా పరవాలేదు కానీ ఇండియాకు వెళ్ళాలనిపించలేదు. మనసును గట్టిగా ఉగ్గబట్టుకుని విమానమెక్కింది మంగ.

హైదరాబాద్ లో మంగకు ట్రీట్మెంట్ మొదలయ్యింది. అనుకున్నవిధంగా ఆపరేషన్ కు సిద్ధపడ్డారు. అహ్మద్ ను తలచుకుని నిట్టూర్చింది మంగ. ఆపరేషన్ సక్సెస్ అవుతుందా. అహ్మద్ ను తిరిగి చూడగలదా. కలవరపడింది మంగ.

స్పృహలో లేని స్థితిలో ఎన్నో పీడకలల లోయలను దాటుకుని భారంగా కళ్ళు తెరిచింది మంగ. అహ్మద్.. నిజమా కలా. కళ్ళు చికిలించి చూసింది మంగ. నమ్మలేకపోయింది. అహ్మదే కాదు. బాబా మామా కూడా ఎదురుగా వున్నారు. నిజమా. తనకోసం కువైట్ నుండి ఇండియాకు వచ్చారా? అనుబంధాలకు, ఆప్యాయతలకు అంత విలువ వుందా. చాలా సంతోషం కలిగింది మంగకు.

"నువు వెళ్ళాక అహ్మద్ ను పట్టుకోవడం మాకు అసాధ్యమై పోయింది. అందుకే టికట్లు కొనుక్కుని వచ్చేసాము. డాక్టర్లు నువు కోలుకోవడానికి నెల రోజులు పడుతుందని చెప్పారు. అంతవరకూ మేము కూడా హైదరాబాద్ లోనే హోటల్ రూము తీసుకుని వుంటాము. రోజూ హాస్పిటల్ కి వచ్చి నిన్ను చూసి వెళతాము. నీకు బాగయ్యాక అందరం కలిసి తిరిగి కువైట్ వెళదాం" చెప్పింది మామా ఆప్యాయంగా.

మామా మాటలు విని మంగ ఆనంద భాష్పాలను రాల్చింది. అహ్మద్ ఉత్సాహంగా గంతులు వేసాడు.

"ఈనాటి ఈ బంధమేనాటిదో..

ఏనాడు పెనవేసి ముడివేసెనో.."

ఎక్కడి నుండో పాట గాలిలో తేలివస్తూ వీనుల విందుగా వినబడుతోంది.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments